తియ్యబోయే చిత్రం ఎంత సక్సెస్‌ఫుల్‌గా రం దాలో ఇప్పట్నుంచే కట్టుదిట్టం చెయ్యసాగాడు స. ద.

ఐనా తనకు దర్శకుడయ్యే యోగం వున్నదో లేదోనని స. ద. 'స్ట్రగుల్' అయ్యాడు. కాస్త సర్దుకుని జ్యోతిష్కుడి దగ్గరకుపోయి చెయ్యి చూపించాడు. జ్యోతిష్కుడు ఆ చేతిని కిందకూ, పైదుకూ తిప్పి దీక్షగా చూసి చూసి టపీమని 'జూమ్ లెన్స్' దృష్టివేసి, బేష్‌మని కేక వేశాడు

"ఏమైంది ?" అన్నాడు స. ద.

"బ్రహ్మాండమైన చిత్రరేఖ. అంటే 'సినీ లైన్'—రెండు జెర్రిపోతుల లావున ఈ చివర నుంచి ఆ చివరకు ప్రాకిపోతోంది. అక్కడితో చెయ్యి ఐపోయిందిగాని, లేకపోతే అది ఇంకా ఎంత దూరం పోయేదో !" అన్నాడు జ్యోతిష్కుడు.

"ఏమిటది ?" అన్నాడు స. ద. అర్థంకాక చూస్తూ.

"చిత్రరేఖండి. చేతుల్లోవుండే మామూలు రేఖలతోపాటు ఈమధ్య ఈ చిత్ర రేఖలు కూడా 'ఫారమ్' అవుతున్నాయి ఈ రేఖగలవాడు సినీ ఫీల్డును ట్రాక్టర్లతో దున్నేసి, మేడలుకట్టేసి, రాజై వూరుకుంటాడు. అందులో మన రేఖ సామాన్యమైందికాదు—చూడండి ఇదే" అన్నాడు జ్యోతిష్కుడు.

"నిజంగానా ?" అన్నాడు స. ద. హీరోయిన్ లాగా కనురెప్పలుకొట్టి విదిలిస్తూ.

"నిజంగాను ఏమిటండీ, ప్రత్యక్షంగా కనిపిస్తూవుంటేనూ. ఇంక నేను మీతో కూడా వుండాల్సిందే."

"ఎందుకేమిటి ?"

"ఎందుకేమిటేమిటి ? అడుగడుక్కీ మీకింత అభమూ శుభమూ చెబుతూ వుండటానికి దానికి"

"అట్లాగేలెండి. ఆ రోజు రానీండి"

"శుభం"

"అభం అని కూడా అనేయండి" అన్నాడు స. ద.—అతని చేతిలో రూపాయి నోటు పెడుతూ.

* * *

స. ద. రూములోని గోడమీదవున్న కాలెండర్లో ఎనిమిది కాగితాలు చిరిగాయి....స. ద. 'ద' అయ్యాడు—అదే దర్శకుడయ్యాడు !

"నేను వేరే రచయితను పెట్టుకుంటాను. అందుకు అనుమతించండి" అన్నాడు నవ దర్శకుడు అవుతూనే

"ఏం—ఏదేమయ్యాడు ?" అన్నాడు నిర్మాత.

"ఐడియాలు రావటంలేదు. కాకపోయినా సాంఘికజీవితాన్ని అద్దంలో చూపించదలచుకున్నాను."

"అంటే సినిమా అంతా అద్దంలోనే తీస్తావా ఏమిటి ?" అన్నాడు నిర్మాత ఆత్రుతగా లేస్తూ.

"అది కాదులెండి ఐనా టైటిల్స్ అద్దంలోనే చూపిస్తున్నాను మళ్ళీ చివరన అద్దంమీదే 'ఎండ్' చేస్తానన్నమాట. అంతా కొత్త టెక్నిక్‌తో తీద్దామని"

"దానికి కొత్త కవి ఎందుకు ?"

"దానికేకాదు. మిగతా కథ కమామీషూ...."



ప్రసాద్ ప్రొడక్షన్స 'భార్యాభర్తలు'లో రేలంగి సంసారం.



భరణివారి 'బాటసారి' లో జానకి, నాగేశ్వరరావు.

"సరే" అని వూరుకున్నాడు నిర్మాత—డబ్బు తక్కువ ఇవ్వవచ్చుగదా అని

ఆ తర్వాత దర్శకుడు, కథకుడూ కమామీషు కుడూ ఐన యువకుడిని తీసుకొచ్చాడు.

"ఇతను ఇట్లా వున్నాడనా ! సామాన్యుడుకాడు. నిర్మాతగారూ ! మహా కవి లక్షణాలు గలవాడు"

"ఆ, నామొహం —ఓ నా మహాకవిని" అన్నాడు యువ కవి నవ్వుతూ.

"చూశారా చూశారా బ్రిలియంట్ మాటన్నాడు. జీనియస్సండీ"

"ఏమిటి మీ కథ ?" అన్నాడు నిర్మాత కవిని.

"సినిమా కథేననుకోండి. ఐతే కొత్తరకంగా వుంటుంది. ప్లెయిన్ సబ్జెక్టు...."

"అది కాదు. మీరేం తీసుకుంటారో ఏమిటో.."

"మీ ఇష్టం...నేనేమి ..."

"అట్లాకాదు. ఇది 'ఫెయిర్ కండిషన్స్' రూము. అంతా నిక్కచ్చి వ్యవహారం"

"మీయిష్టం అనేశానుగా"

"సరే....అన్నట్టు మీ కథలో సెంటిమెంటు వుందా లేదా ?" అన్నాడు నిర్మాత అది చెప్పండి ముందన్నట్టు.

"మీదంతా సెంటిమెంటాలటీ. ఆ మెంటాలటీ మరి మారదు" అన్నాడు దర్శకుడు.

"సెంటిమెంటులేకుండా నువ్వేం చిత్రం తీస్తావయ్యా ?" అన్నాడు నిర్మాత దూకుడుగా.

"మీకు ఈ సెంటిమెంటు పిచ్చి బాగా పట్టుకుంది. మిమ్మల్నందర్నీ తీసుకెళ్ళి సెంటిమెంటల్ హాస్పిటల్‌లో పారెయ్యాలి" అన్నాడు దర్శకుడు మాట కొద్దిగా జోరయినా అతను గసరకుండా వుండేందుకు నవ్వేస్తూ.

"నాన్సెన్స్. ఐడోంట్" అన్నాడు నిర్మాత రుసరుసలాడుతూ.

# (అ)దర్శకత్వం

"ఐతే సెంటిమెంటు వుండాలని తమ పట్టుదలా ?" అన్నాడు యువ కవి.

"ఆహా విధిగా"

"వుంచుదామండీ ఐతేనూ. కాకపోయినా సెంటిమెంటు పిప్పరమెంటు వంటిదన్నారు" అన్నాడు యువ కవి నవ దర్శకుడితో.

"నేను అనలేదు....ఐతే కథ దెబ్బతింటుంది"

"ఎందుకు తింటుందయ్యా—మరింత బలం వస్తుంది. స్టోరికి టానిక్‌లాంటిది సెంటిమెంట్" అన్నాడు నిర్మాత.

"స్టోరీ వీక్ ఐనప్పుడుకదా టానిక్ అవసరం" అని దర్శకుడి వాదం.

"నాన్సెన్స్" అన్నాడు నిర్మాత. ఒప్పుకోలేదు. సెంటిమెంట్ జోడించటానికి దర్శకుడు అంగీకరించ తప్పలేదు!

యువ కవీ, నవ దర్శకుడూ సబ్జెక్టుమీద కూచున్నారు. అట్లా కొన్నాళ్ళు కూచున్నాక, ఒక నాడు లేచారు.

"ఐంది—అమ్మయ్య" అన్నాడు దర్శకుడు.

"అమ్మయ్య—ఐంది" అని కరక్టు చేశాడుకవి. ఇద్దరూ కలిసి నిర్మాతకు వినిపించారు.

"ఏమిటిది—హాస్యమో ?" అన్నాడు నిర్మాత.

"హాస్యానికి చోటులేదండీ. హాస్యంకాదు—ఈ రకం కథలో. ."

"టీడియస్‌గా వుంటుంది"

"పిక్చరైజేషనల్ అవేవీ వుండవు"

మళ్ళీ మాట్లాడుకున్నారు—పోట్లాడుకున్నారు హీరోకి ఒక ఫ్రెండునుపెట్టి దాన్ని హాస్య పాత్రను చెయ్యమన్నాడు నిర్మాత.

"నా ఆదర్శం !" అనుకున్నాడు దర్శకుడు.

అతని ఆదర్శం దమ్మిడీ పని చెయ్యలేదు. హాస్య పాత్ర ప్రవేశించింది. తర్వాత పాత్రల నిర్ణయం చేశాడు నిర్మాత. స్టార్‌వాల్యూ వుండాలని హీరోయిన్ పాత్రకు పెద్ద తారను తీసుకోవాలన్నాడు.

"పెద్ద తారలు వద్దండీ చెప్పినట్టు వినరు. మనం ఒకటిఅంటే వాళ్ళ ఒకటి అంటారు. కొత్తమ్మాయిని...."

"కొత్తమ్మాయా, సింగినాదమా—అదేం పనికిరాదు. స్టార్ లేకుండా నువ్వు చిత్రం తీస్తావా—నన్ను మన్ను తినమనా ఏమిటి నీ ఉద్దేశం ?" అన్నాడు నిర్మాత కోపంగా.

దర్శకుడు దెబ్బతిన్నాడు 'మీ యిష్టం' అన్నాడు.

నిర్మాతా దర్శకుడూ పెద్ద తార ఇంటికి వెళ్లారు. ఆమెకు కథ చెప్పారు.

"చెప్పు లేదు" అన్నదామె, లిప్‌స్టిక్ పెదవిని ముందుకుతోస్తూ.

"కొత్త టెక్నిక్‌లెండి. అనవసరంగా హీరోయిన్‌కూ, హీరోకూ పాటలూ అవి పెట్టి .." అగబోయాడు దర్శకుడు.

"బలేవారే, హీరోయిన్‌కు పాటలు అనవసరం అని మీరు అనగా చూశాను. ఇంకా కొత్తగా!—అనుభవం కావాలి" అన్నదామె నిర్మాతతో.

"హీరోవెళ్లిపోయాక, ఆమె ఒంటరిదైపోయింది చూడూ, అక్కడో పాథటిక్ పాట పెట్టు" అన్నాడు నిర్మాత.

"రియాలటీకి ఎగినెస్టు నిర్మాతగారూ" అన్నాడు దర్శకుడు.

"ఏమీకాదు. ఇన్ని చిత్రాల్లో వుండగా లేనిది ఇందులోవచ్చిందా! సినిమా సినిమాలే" అన్నాడునిర్మాత.

"ఐనా నా పాత్ర గురించి ఇంకాస్త మాట్లాడాలి. ఎక్కడో బరువు చాలనట్టు ఫీలయ్యాను" అన్నది తార.

'నా ఆదర్శమా' అనుకున్నాడు దర్శకుడు పైకి చూస్తూ. ఆ తర్వాత కవీ, హీరోయినూ కూచుని పాత్రను మార్చారు. నిర్మాత మెచ్చుకున్నాడు దర్శకుడికి ఏంచెయ్యాలో పాలుపోలేదు !

సెట్టుమీదకువెళ్లేముందు చూసుకుంటే తను మొదట రాసుకున్న కథకూ ఈ కథకూ ఏమాత్రమూ పోలికలులేవు. తాను అనుకున్నవన్నీ అడ్డం కాసాగాయి.

ప్రప్రథమ దినం—కాల్‌షీటు, హీరోయిన్ ఇల్లు వేశారు. సెట్టు చాలా వాస్తవికంగా వున్నది. పూరి గుడిసె, కోళ్ళు, చెత్తా, మట్టిదిబ్బలూ అంతా చాలా బీదరికంగా వున్నది. ఆ సెట్టులో హీరోయిన్ వుండగా, అప్పులాళ్ళవచ్చి ఆమెను కొట్టే సీను తియ్యాలని నిర్మాత ఆదేశం. అదేట సెంటిమెంటు !

కాల్‌షీట్లో నాల్గు గంటలకాలం గడిచిపోయాక హీరోయిన్ ప్రవేశించింది—నవనాగరీకంగా

దర్శకుడు మొత్తుకున్నాడు. చాలా బీదగా వుండాలన్నాడు.

"ఇదేమిటండీ, బీదగా ఎట్లా ? గ్లామర్ లేకపోతే నా అభిమాన ప్రేక్షకులు ఎట్లా సహిస్తారూ" అన్నదామె. అంతలోనే సెట్టంతా కలియజూసి, 'ఏమిటీ సెట్టూ ? హీరోయిన్ యిల్లు ఎంత పూరికొంపయినా, కాస్త పూలచెట్లూ, చక్కని దాలీ, ఒక అందమూ వుండాలి ఏమిటీ చండాలం ?" అన్నదామె నిర్మాత వెంటనే ఆర్టు డైరక్టరుకు కబురు పెట్టి, సెట్టంతా అందంగా వెయ్యమన్నాడు.

"అది కాదండీ. కథలో మనకు ఏమిటంటే...." అనబోతున్నాడు దర్శకుడు.

"ఏమి కథయ్యా చెప్పినట్టు తియ్యి. ఓ అందమూ లేక చందమూ లేక ఏం తీస్తావయ్యా సినిమా? వెయ్యవయ్యా, ఆచార్‌గ్రౌండులో చందమామను వెయ్యి" అని గట్టిగా ఆదేశించాడు ఆర్టువాళ్లను.

"ఇది డేసీను కదా" అన్నాడుదర్శకుడుఅసిస్టెంటు.

"డే ఏమిటి, నైట్‌గా మార్చండి చందమామ లేకుండా హీరోయిన్ యిల్లూ నువ్వునూ" అని కోప్పడ్డాడు నిర్మాత.

దర్శకుడికి కాళ్ళూ చేతులూ ఆడలేదు. సెట్టు మార్చటానికిగాను ఆరోజు కాల్‌షీట్ కాన్సిల్ చేసి వెళ్లిపోయింది హీరోయిన్.

నాలుగు గోడల మధ్యా చాపమీద వెల్లకిలా పడుకుని చుట్టూ చూశాడు దర్శకుడు ! 'నా ఆదర్శాలు' అనుకున్నాడు ఓ సారి. ఇంకాస్సేపటికి లేచి కూచుని 'నా ఆదర్శాలు, నా ఆదర్శాలు' అన్నాడు. ఈసారి గట్టిగానే. ★


నాటక, నాట్య, సంగీత
కళాభిలాషులకుఅమూల్య కానుక
తెలుగుసంవత్సరాది నుండి ప్రారంభం
నాటకరంగ అనుభవాలు
నటుస్థానం
రచన : 'పద్మశ్రీ' స్థానంనరసింహారావు
కూచిపూడి నాట్యహారాలు, చరిత్ర
నాట్యమాల
రచన : శ్రీవెంపటిసత్యం
నాట్యభంగిమ చిత్రాలు : శ్రీతో
తానవర్ణ సుధానిధి
అను సంగీతకళానిధి
రచన : శ్రీగాలిపెంచల నరసింహారావు
పూర్తి వివరాలుగల 1-8-61 'నటన' సంచిక కోరువారికి ఉచితముగా పంపబడును.
పాఠకులు, చందాదారులు, ఏజంట్లు త్వరపడండి.
అడ్రసు : 'నటన',
71, క.ఆర్. కోయిల్ వీధి, మద్రాసు-33



